


## కొత్త వేరియంట్లతో
# మళ్లీ ముప్పుగా కరోనా



- విశాఖలో కోవిడ్ విజృంభణతో అప్రమత్తమైన ప్రభుత్వం
- విమ్స్‌లో 20 పడకల ప్రత్యేక వార్డు ఏర్పాటు
- అందుబాటులో రాపిడ్ కిట్లు, మందులు
- విమ్స్‌లో 20 పడకల కోవిడ్ వార్డు సిద్ధం
- రాపిడ్ కిట్లు, ఆర్టీపిసిఆర్ పరీక్షలతో నిర్దిష్ట వైద్యం
- కొత్త వేరియంట్లపై ప్రజల అప్రమత్తత కీలకం
- మాస్కు, శానిటైజేషన్, భౌతికదూరం పాటించాల్సిన అవసరం ప్రజలపై ఉంది

**క్రైమ్ బ్యూరో పెన్ పవర్, విశాఖపట్నం మే 23:**కోవిడ్ మహమ్మారి మళ్లీ రూపాంతరం చెంది సమాజాన్ని ఉలిక్కిపడేలా చేస్తోంది. జెఎన్ 1, ఎల్ఎఫ్ 7, ఎన్‌బి 1.8 వంటి కొత్త వేరియంట్లు ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న తరుణంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, విశాఖపట్నంలోని విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో 20 పడకలతో కూడిన ప్రత్యేక కోవిడ్ వార్డు సిద్ధమయ్యింది.

**ఒక కేసుతో అప్రమత్తమైంది ప్రభుత్వం :**

విశాఖ నగరంలో ఒక కోవిడ్ కేసు నమోదవడం, కొత్త వేరియంట్ల ద్వారా వ్యాధి వేగంగా వ్యాపించే అవకాశం ఉండటంతో ప్రభుత్వం తక్షణమే స్పందించింది. "ప్రస్తుతం ప్రజల్లో ఆందోళన కలిగించే స్థాయిలో వేరియంట్లు బయటపడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో జాగ్రత్తలు తప్పనిసరి" అని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు తెలిపారు.

**వైద్య సేవలకు పూర్తిస్థాయి సన్నాహాలు:**

విమ్స్ ఆసుపత్రిలో ప్రత్యేక వార్డుతో పాటు అత్యవసర వైద్య సదుపాయాలు కూడా సిద్ధంగా ఉంచారు. వైద్య సిబ్బందికి పిపిఇ కిట్లు, రోగులకు అవసరమైన ఔషధాలు, ఆక్సిజన్ సప్లై వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఏవైనా తాత్కాలిక లక్షణాలు కనిపించిన వెంటనే రాపిడ్ టెస్టింగ్ కిట్‌లను వినియోగించి, ఆర్టీపిసిఆర్ ద్వారా నిర్ధారణ చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

**ప్రజల పాత్ర కీలకం – మాస్కులు తప్పనిసరి :**

కోవిడ్ నివారణలో ప్రజల జాగ్రత్తలు ముఖ్యమని డాక్టర్ రాంబాబు పేర్కొన్నారు. సామాజిక దూరం పాటించాలి, మాస్కు ధరించడం తప్పనిసరి చేసుకోవాలని, శానిటైజేషన్ అలవాటు చేసుకోవాలని, గర్భిణీ స్త్రీలు, వృద్ధులు అనవసరంగా బయటకి రావొద్దని, వినోదం కోసం బహిరంగ ప్రదేశాల్లో తిరగడం నివారించాలని హెచ్చరించారు.

**'సమాజం బాధ్యతగా నడవాలి' – డాక్టర్ కె. రాంబాబు**

"ప్రభుత్వం తనవంతు ప్రయత్నం చేస్తోంది. కానీ సమాజం కూడా బాధ్యతగా ప్రవర్తించాలి. మళ్ళీ కరోనా విజృంభించకూడదనుకుంటే ముందస్తుగా మనమే అప్రమత్తంగా ఉండాలి," అని డాక్టర్ రాంబాబు పేర్కొన్నారు.

# ఇరవై సూత్రాల అమలుపై చైర్మన్ లంక దీనకర్ సమీక్ష

## నేడు10.30 గంటలకు కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్,అనకాపల్లి, మే 23:**జిల్లాలో అమలవుతున్న పలు కేంద్ర, రాష్ట్ర పథకాలపై ఇరవై సూత్రాల కమిటీ చైర్మన్ లంక దీనకర్ నేడు (శనివారం) సమీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం జరగనుందని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, జల్ జీవన్ మిషన్, పీఎం-గ్రామీణ సడక్ యోజన, టిడ్కో గృహాలు, అమృత్, లాఖ్ పతి దీదీస్, పీఎం సూర్యఘర్, విశ్వకర్మ వంటి పథకాలపై సమీక్ష జరుగుతుంది. అంతేగాక, పర్యాటక అభివృద్ధి, పారిశ్రామిక పార్కులు, మురికివాడల అభివృద్ధి, తాగునీటి సరఫరా తదితర అంశాలపై చర్చించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పూర్తి వివరాలతో హాజరుకావాలని ఆమె ఆదేశించారు.

# సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



- విశాఖలో 19 కేంద్రాలు - 8,424 మంది అభ్యర్థులకు పరీక్ష

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్, విశాఖపట్నం మే 23:**ఈ నెల 25న జరగనున్న యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష సజావుగా జరగేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాల్లో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

జిల్లా పరిధిలోని 19 పరీక్షా కేంద్రాల్లో 8,424 మంది అభ్యర్థులు హాజరుకానుండగా, 193 జామర్లను ఏర్పాటు చేయనున్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, శౌచాలయాలు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష ప్రశాంతంగా సాగేందుకు ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సమస్యలు ఎదురైతే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్ నంబర్లు: 0891-2590100, 0891-2590102.

పరీక్ష రెండు సెషన్లలో నిర్వహించనున్నారు %-% ఉదయం 9.30 నుండి 11.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుండి 4.30 వరకు. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు రావాల?, ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధించబడ్డాయని తెలిపారు. గుర్తింపు కార్డు లేదా ఈ-ఐడీ తప్పనిసరిగా తీసుకురావాలని, అందుబాటులో లేని పక్షంలో సెల్ఫ్ డిక్లరేషన్ ఫారమ్ సమర్పించాలని సూచించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్. భవానీ శంకర్, యూపీఎస్సీ డైరెక్టర్ పట్టనాయక్ తదితరులు పరీక్ష విధివిధానాలపై వివరణ ఇచ్చారు.




# పెన్ పవర్
## ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# క్వారీ-చుట్టూ నిర్మాణాలు ఆదమరిస్తే !





**అక్రమ నిర్మాణాలకు అనుమతులు లేవు అతిక్రమించడం వారిపై చర్యలు తప్పవు**

**జోన్ 2 టి పి ఒ బాలరాజు వివరణ**

**రామకృష్ణాపురం అంటేనే ఒక పద్మవ్యూహం ఈ గ్రామం పై అందరూ హక్కుదారులే**

**రాజకీయ నాయకులకు ఓట్ బ్యాంక్.నాయకులకు క్యాష్ బ్యాంక్**

**కామా ఫుల్ స్టాప్ ఆబ్లిక్ లకు తేడా తెలియని స్థానికేతరులు ఆధిపత్యం**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విశాఖపట్నం మే 23:**తూర్పు నియోజకవర్గం జీవీఎంసీ జోన్ 2 పరిధి 13 వ వార్డు రామకృష్ణాపురంనకు సమీపంలో ఉన్న నల్ల రాతి క్వారీని ఆనుకుని గతంలో అక్రమ గృహాలు వెలిశాయి. రాను రాను ఆ ప్రాంతం రామకృష్ణపురం లో విలీనం చేశారు.రోడ్లు కాలువలు యుజీడి,విద్యుత్ వెలుగులు త్రాగునీరు సదుపాయాలు కల్పించారు.2014లో జీవీఎంసీ లెక్కల ప్రకారం 750 ఇళ్ళను గుర్తించి 230 మంది లబ్ధిదారులను ఎస్ ఎస్ ఎన్ నగర్,196౦29 మంది లబ్ధిదారులను పైనాపిల్ కాలనీ, శ్రీకాంత్ నగర్ లలో గల జే ఎన్ ఎన్ యు ఆర్ ఎం గృహ సముదాయాలకు తరలించారు. మిగిలినది ఎంతమంది అన్నది పాఠకులకు పాలకులకు తెలిసిన విషయమే కానీ ప్రస్తుతం సచివాలయలకు ప్రకారం 600 ఇళ్ళను గుర్తించినప్పటికీ అనధికారు లెక్కల ప్రకారం 750 పై గృహాలు ఉండవచ్చును. రామకృష్ణాపురంలో నివాసంతో ఉన్నవారు కొందరైతే ఇతర ప్రాంతాలలో ఉంటూ ఇక్కడలో ఇళ్లలో ఖాళీ స్థలాలను ఇళ్ళను ఏర్పరచుకున్న వాళు మరికొందరు. ఇది ఇలా ఉండగా 2014లో బిఆర్టిఎస్ రోడ్లు విస్తరణలో భాగంగా ఇళ్లల్లో కోల్పోయామంటూ లబ్ధిదారులుగా ఉంటున్న మాకు ఇళ్లను మంజూరు చేయాలంటూ కొందరు అసలు 80 మంది 20 మందిని లబ్ధిదారులను అదనంగా చేరుస్తూ జీవీఎంసీ అధికారులకు,జిల్లా కలెక్టర్ ప్రజా ప్రతినిధులకు జాబితాలు అందజేస్తూ ఇళ్లను మంజూరు చేయాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదు చేసారు.ఈ ప్రాంతంలో ప్రజా ప్రతినిధుల పేరుట వారి ప్రతినిధులు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.

ఇక్కడ ఉన్న రామకృష్ణాపురం గ్రామాన్ని పలుదపాలుగా తరలించడం ఇళ్లను కేటాయించడం జరగడానికి ప్రధాన కారణం ముడసర్లోవ రిజర్వాయర్ క్యాచ్ మెంట్ ఏరియా కావడం.సహజ వనరులతో ఏర్పడ్డ ఈ రిజర్వాయర్ సమీపంలో పైనుండి నుండి ప్రవహించిన వర్షపు నీరు ఈ ప్రాంతం గుండా రిజర్వాయర్లో కలవడం భారీ అతి భారీ వర్షాలు సమయంలో నీటి ప్రవాహాలు ఈ గ్రామాలు అడ్డుగా ఉన్నాయంటూ వీటిని తరలించేందుకు మరియు బిఆర్టిఎస్ రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్ళను తరలించడం కూడా జరిగింది.రాజకీయ నాయకుల ఓట్ బ్యాంకు రాజకీయాలకు నిలయంగా మారిన ఈ గ్రామం అభివృద్ధి చెందకపోగా కనీస సౌకర్యాలు కల్పిస్తూ ఈ గ్రామాన్ని ఎటు ఎదగనీయకుండా ఉంచేశారు. అదే సమయంలో ఈ ప్రాంతం ముంపుకు గురి కావడంతో కాలువలు బ్రిడ్జిలు ఏర్పాటు చేయడం జరిగింది.

రామకృష్ణపురం గ్రామ ప్రజలను వివిధ పార్టీల అభ్యర్థులు ఓట్ బ్యాంకు రాజకీయాలకు వాడుకుంటున్నారని, తమ ఇళ్లకు పట్టాలు మంజూరు చేసి ఒక్క నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు ఇవ్వాలని,రైల్వే జోన్ కు కేటాయించిన స్థలం క్యాచ్ మెంట్ ఏరియాలో కానప్పుడు మా గ్రామం ఎందుకు వాటర్ క్యాచ్ మెంట్ ప్రాంతంగా ఉంచుతున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలలో వాడుకొని మమ్మల్ని మురికి కూపంలో ఉంచుతున్నారని ఎన్నికలు వచ్చిన ప్రతిసారి మా గ్రామ ప్రజలను ఓటర్లుగా గుర్తించి అవసరాలకు వాడుకోవడం తప్ప మా కష్టాలను తీర్చడం లేదని వారు వాపోతున్నారు. పక్కాఇల్లునిర్మించుకునేందుకు అనుమతులు మంజూరు చేయాలని, ఏపీ హౌసింగ్ బోర్డ్ ద్వారా ఇళ్ళను నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం స్కీములను మంజూరు చేయాలని, అధికారులు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాలు తమకు సహకరించాలని కోరుతున్నారు.

సందెట్లు సడే మియా అంటూ గ్రామంలో కొందరు నాయకులు ప్రజా ప్రతినిధుల అండదండలతో వారి పేరు ని చెప్పుకొని అనధికార ఇళ్లను నిర్మించుకుంటున్నారు. క్వారీ సమీపంలో అతి ప్రమాదం పరిస్థితులలో ఇళ్ళను నిర్మించుకుంటున్న వీరిపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం స్థానిక నాయకులు వీటిని నిర్మాణానికి వత్తాసు పలకడం జరగరాని సంఘటన ఏమైనా జరిగినట్లయితే దానికి బాధ్యులు ఎవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.గతంలో ఈ ప్రాంతంలో క్వారీ లో పడి ఒక వ్యక్తి మరణించడం కూడా జరిగింది.

20014లో 750 మంది గృహాలతో ఉన్న ఈ గ్రామం లెక్కకు మించి నిర్మాణాలు జరుగుతున్న అధికారులు వీటిని పట్టించుకోకపోవడం కొందరి నాయకుల కను సన్నలలో నిర్మాణాలు జరగడం తీవ్ర విమర్శలకు దారితీస్తున్న ఇవి ఏమీ పట్టని నాయకులు నిర్మాణాలను యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో అందరూ నాయకులే ప్రతి నిర్మాణం వెనుక ఒక నాయకులు మేము ఫలానా తాలూకు అని చెప్పుకునే పరిస్థితి ఏర్పడింది.

రామకృష్ణ పురం గ్రామం 2014 ప్రకారం 750 గృహ లబ్ధిదారులకు గాను 455 మంది లబ్ధిదారులను వేరే ప్రాంతాలకు తరలించగా మిగిలిన కుటుంబాలు గ్రామంలో ఉండిపోగా ఇప్పుడు అది అనధికారపుగా అభివృద్ధి చెంది 600 పైగృహాలు. లెక్క సచివాలయ లెక్కల ప్రకారం సుమారుగా600గృహాలు ఉన్నట్లు గుర్తించారు.

ఇన్ని అవకతగులు జరుగుతున్నా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం గ్రామాన్ని అభివృద్ధి పరచకపోవడం వెనుక గల కారణాలు అనేక ప్రశ్నలుగా మిగిలిపోయాయి. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి పక్కా గృహాల నిర్మించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న అనధికార నిర్మాణాలపై ప్రజాప్రతినిధులు అధికారులు చర్యలు చేపట్టి అక్రమ నిర్మాణాలను అరికట్టాలని వారి సమీపంలో నిర్మిస్తున్న నిర్మాణాలపై చర్యలు చేపట్టి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ: కలెక్టర్ దినేష్ కుమార్





## పిజిఆర్ఎస్‌కు 89 ఫిర్యాదులు స్వీకరణ

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్,పాడేరు, మే 23:**జిల్లాలో భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేశారు. ప్రజల నుంచి పదేపదే భూ సమస్యలపై ఫిర్యాదులు రావడం నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

శుక్రవారం ఐటిడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన 'మీకోసం – ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో కలెక్టర్ జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఆర్ఓ కె. పద్మలతలతో కలిసి వివిధ మండలాల నుండి వచ్చిన 89 మంది అభ్యర్థుల ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు మ్యుటేషన్ ప్రక్రియను చురుకుగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే వివిధ శాఖలలో అపరిష్కృతంగా ఉన్న ఫైళ్లపై సంబంధిత అధికారులకు తక్షణం చర్యలకు ఆదేశాలు జారీ చేశారు.

వివిధ మండలాల నుండి వచ్చిన ప్రధాన ఫిర్యాదులు:

హుకుంపేట మండలం శోభకోట పంచాయతీ ఈదుల గొంది గ్రామస్థులు బీటీ రోడ్డుల నిర్మాణం కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

జి.కె. వీధి మండలం అంతాడ గ్రామ పంచాయతీకి చెందిన కాకరపాడు గ్రామానికి రహదారి సదుపాయం కల్పించాలని కాకిరి బాలన్న, జి. నీలమ్మలు విజ్ఞప్తి చేశారు.

పాడేరు మండలం వనుగుపల్లి పంచాయతీ వరంకుర పివిటిజి గ్రామానికి రహదారి అవసరమని ఎం. సన్యాసిరావు, కె. బాబూరావు లు వినతి పత్రాలు అందజేశారు.

అరకువ్యాలీ మండలం పెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు చెక్ డ్యామ్ నిర్మాణం వల్ల 250 ఎకరాల సాగునీరు సమస్య పరిష్కారమవుతుందన్నారు.

ముంచంగిపుట్టు మండలం చిన్న సిందిపుట్టు గ్రామానికి 2015లో నిర్మించిన అంగన్వాడీ భవనానికి బిల్లు మంజూరు చేయాలని కిల్లో రాంబాబు ఫిర్యాదు చేశారు.

ఈ కార్యక్రమంలో ఎన్డీసీ సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు, గిరిజన అధికారి ఎల్. రజని, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్. కుమార్, రహదారులు-భవనాల శాఖ అధికారి బాల సుందరబాబు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ జవహార్ కుమార్, పంచాయతీరాజ్ ఇఇ టి.కొండయ్య పడాల్, తహసీల్దార్ వి. త్రినాధరావు నాయుడు తదితర అధికారులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థికి వాసుపల్లి పదివేల ఆర్థిక సాయం

**సూపర్ సిక్స్ హామీలతో మోసం: వాసుపల్లి గణేష్ కుమార్ విమర్శ**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్ మే 23:**సూపర్ సిక్స్ పేరుతో అమలుకానీ హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. అమలు చేయలేని హామీలెందుకు? అంటూ ప్రశ్నించారు.

ఆసీలమెట్ట కార్యాలయంలో 38వ వార్డు విద్యార్థిని గీతా ఇంటర్ చదువుల ఫీజు కోసం వచ్చిన దరఖాస్తును పరిశీలించి, తన స్వంత నిధుల నుంచి పదివేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాసుపల్లి, "ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలతో ఉన్న వాస్తవ సంబంధం కొనసాగిస్తూ, సీఎం జగన్ నాయకత్వంలో సాగిన సంక్షేమ పాలనను కొనసాగించాలనే నమ్మకం ఉంది," అని పేర్కొన్నారు.

తాజా ప్రభుత్వంపై మండిపడ్డ వాసుపల్లి గణేష్ కుమార్, "చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ఒక్క హామీ కూడా పూర్తిగా అమలుచేయలేదని, మత్స్యకార భరోసాను కోత పెట్టి 50% మత్స్యకారులను విస్మరించారని" ఆరోపించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, యువతకు ఉద్యోగ హామీలు గాలికి వదిలేశారని విమర్శించారు.

జగన్ పాలనలో విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇచ్చి అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్మెంట్, మెడికల్ కళాశాలల నిర్మాణం వంటి పథకాలు అమలు చేశారని కొనియాడారు. కేవలం పదవుల కోసమే కార్పొరేటర్లతో బేరసారాలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కార్యక్రమంలో 30వ వార్డు అధ్యక్షుడు దశమంతలు మాణిక్యాలరావు, 39వ వార్డు అధ్యక్షుడు ముజుబ్ ఖాన్, సౌత్ బూత్ కమిటీ సభ్యులు, వైఎస్సార్సీపీ ముస్లిం నాయకులు చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమ్మెపై చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్‌కు వామపక్ష, కార్మిక సంఘాల జెఏసి వినతి



**గాజువాక, పెన్ పవర్ మే 23:**విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులను నిరసిస్తూ గత నాలుగు రోజులుగా సమ్మె కొనసాగుతుండగా, దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వామపక్ష పార్టీలు, అఖిలపక్ష కార్మిక సంఘాల జెఏసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. రెహ్మాన్‌లు మాట్లాడుతూ, ఉత్పత్తి సామర్థ్యం పెంపుకు 6 వేల మందికి పైగా కార్మికులు అవసరమన్నా, ఇప్పటికే 1700 మందిని తొలగించగా, మరో 2500 మందిని తొలగించేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తున్నదన్నారు. అలాగే, 1200 మంది పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరుతో తొలగించారని తెలిపారు.

కార్మికులపై నిర్బంధం, పోలీసుల నియామకం, పాస్‌ల నిలుపుదల, బెదిరింపులు కొనసాగుతున్నాయని విమర్శించారు. ప్లాంట్‌కు నష్టం తలెత్తకుండా యాజమాన్యం%–%సంఘాలతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ ఈ అంశంపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిపిఐఎంఎల్ ప్రజాపోరు జిల్లా కార్యదర్శి ఎస్.దేవా, ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి గోవిందరాజులు, సిపిఎం, సిపిఐ, సిఐటియు, ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

## జనసేన కండువా కప్పుకున్న కృష్ణ పాలెం గ్రామం

- రాంబిల్లి మండలం కృష్ణంపాలెం గ్రామంలో జనసేనకు మెరుగైన భవిష్యత్ : ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్



**ఎలమంచిలి, పెన్ పవర్ మే 23:**ఎలమంచిలి నియోజకవర్గంలోని రాంబిల్లి మండలానికి చెందిన కృష్ణంపాలెం గ్రామం ప్రజలు పెద్ద ఎత్తున వైఎస్ఆర్సిపి పార్టీని విడిచిపెట్టి జనసేనలో చేరారు. రాష్ట్రంలో మార్పు శక్తిగా ఎదుగుతున్న జనసేన పార్టీ నాయకత్వం, ముఖ్యంగా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రవేశపెట్టిన ప్రజాకేంద్రీత ప్రణాళికలు, అభివృద్ధి పథకాలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయని తెలియజేశారు.

ఈ సందర్భంగా గ్రామస్థుల భారీ చేరికను ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ స్వాగతించారు. గ్రామస్తులు తమ భవిష్యత్ తరాల కోసం ఒక స్థిరమైన, అచ్చమైన మార్గదర్శనం కావాలన్న ఆశతో, పవన్ కళ్యాణ్ నాయకత్వంపై నమ్మకంతో, జనసేన పార్టీ శ్రేయస్సు కోసం ముందడుగు వేశారని పేర్కొన్నారు.

ఈ చేరిక కార్యక్రమం గ్రామ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. పార్టీలో చేరిన గ్రామస్తులు, "అభివృద్ధి చూసి మేం కూడా అభివృద్ధి కాముకులం కావాలని నిర్ణయించుకున్నాం" అని అన్నారు. గ్రామం మొత్తంగా పార్టీ మారడం తక్కువ సందర్భాల్లోనే జరుగుతుందని, ఇది జనసేన పార్టీకి గ్రామ స్థాయిలో పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమని పార్టీ నాయకత్వం పేర్కొంది.

ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, స్థానిక కార్యకర్తలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభకు త్రిచక్ర వాహనంతో కొత్త గమ్యం

- కలెక్టర్ విజయ క్రిష్ణన్ చేతుల మీదుగా తూర్రి రవికి విలువైన వితరణ



**అనకాపల్లి, పెన్ పవర్ మే 23 :**ప్రతిభకు ప్రతిబంధకాలు అడ్డుకావని నిరూపిస్తున్న విభిన్న ప్రతిభావంతులకు వాహనంగా నిలుస్తూ, అచ్యుతపురం సెజ్‌లోని టొయోట్సొ రేర్ ఎర్త్ జపాన్ సంస్థ, సామాజిక బాధ్యతను మరోసారి చాటింది. తమ సిఎస్ఆర్ నిధుల ద్వారా, రావికమతం మండలం రోచుపణుకు గ్రామానికి చెందిన తూర్రి రవికి త్రిచక్ర హెూండా యాక్టీవా వాహనాన్ని అందించింది.

ఈ వాహనాన్ని శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ స్వయంగా అందజేశారు. తన మేధస్సుతో పాటు నిబద్ధతను చూపుతూ అనేక కష్టాలను ఎదుర్కొంటున్న రవికి ఇది ఒక కొత్త ఆశ, కొత్త మార్గం కావాలని ఆమె ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సుధాకర్, కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మురళీధర్, క్వాలిటీ కంట్రోల్ హెడ్ ఆర్. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.సామాజిక బాధ్యత అనేది సంస్థలు తీసుకోవాల్సిన ఋణమని, ప్రతి ఒక్కరిలో మానవతా విలువలు నూరిపోసే ప్రయత్నానికి ఇది ఒక చక్కని ఉదాహరణగా నిలిచిందని హాజరైన వారు పేర్కొన్నారు.

## 38వ వార్డులో మేయర్ విస్తృత పర్యటన





- కల్వర్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్ మే 23:**విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జోన్–4లోని 38వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా టౌన్ కొత్త రోడ్ జంక్షన్‌లో జరుగుతున్న కల్వర్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు రవాణా అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రే కార్యక్రమాలు ముమ్మరం చేయాలని సూచించారు. ప్రభుత్వ గోషా ఆసుపత్రి సమీపంలో మలేరియా విభాగం నిర్వహించిన అవగాహన ప్రదర్శనను సందర్శించి, అధికారుల పనితీరుపై ఆరా తీశారు. అలసత్వంగా వ్యవహరిస్తున్న మలేరియా వర్కర్‌ను తొలగించి, ఇన్స్పెక్టర్‌కు శోకాజ్ నోటీసు ఇవ్వాలని, సహాయ వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు.

టౌన్ హాల్, హెచ్‌ఆర్డి సెంటర్, వాటర్ ట్యాంక్ ప్రాంతాల్లో పరిశీలన జరిపిన మేయర్, వాచ్‌మెన్ ఏర్పాటు, తుప్పు తొలగింపు, అద్దె వివరాలపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వన్‌టౌన్ శివాలయం వీధిలో గాంధీ పార్క్ కాంపౌండ్ వాల్ పెంపు, బస్తీ అక్రమ నిర్మాణాల తొలగింపు అంశాల్లో సంబంధిత అధికారులతో చర్చించారు.

అంతకుముందు మేయర్ కనకమహాలక్ష్మి అమ్మవారిని, కంచర్ వీధిలో వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని దర్శించుకున్నారు. దేవాలయం ఎదురుగా ఉన్న నూతికి మరమ్మతులు చేసి తాగునీటి వినియోగానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

ఈ పర్యటనలో కార్పొరేటర్ విజయలక్ష్మి, ఇంజనీరింగ్, వైద్య శాఖ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.





## బృహత్ ప్రణాళిక-2041పై అభిప్రాయాలకు గడువు

- జూన్ 21 వరకు సలహాలు అందించవచ్చు - వి.ఎం.ఆర్.డి.ఏ చైర్ పర్సన్ ప్రణవ్ గోపాల్



**విశాఖ తూర్పు, పెన్ పవర్, మే 23:**వి.ఎం.ఆర్.డి.ఏ రూపొందించిన మాస్టర్ ప్లాన్%–%2041పై గత ప్రభుత్వ హయాంలో అనుచిత మార్పులు జరిగి, కొంతమంది వ్యక్తులు లబ్ధి పొందిన విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు విఎంఆర్‌డిఏ చైర్ పర్సన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ తెలిపారు

ఈ నేపథ్యంలో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ, ప్రణాళికను పునఃపరిశీలించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 22వ తేది నుంచి జూన్ 21వ తేదీ వరకు ప్రజలు తమ అభిప్రాయాలు, సూచనలు వి.ఎం.ఆర్.డి.ఏ 7వ అంతస్తు కార్యాలయం, లేదా %జఎతీఝ.శ్రశీఙ.ఱఅ/శీఎయవష్ఱశీఅ% వెబ్‌సైట్ ద్వారా లేదా పోస్టు ద్వారా పంపవచ్చునని వివరించారు.

ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

## మండలంలో మంచినీటి ట్యాంకర్, చెత్త సేకరణ ట్రాక్టర్ల ప్రారంభం





- ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం

**పరవాడ, పెన్ పవర్ మే 23:**పెందుర్తి నియోజకవర్గంలోని పరవాడ మండలంలో రావాడ మేజర్ పంచాయతీ నిధులతో కొనుగోలు చేసిన మంచినీటి ట్యాంకర్‌తో పాటు ఇంటింటికీ చెత్త సేకరణ కోసం అందుబాటులోకి తేవనున్న ట్రాక్టర్లను శుక్రవారం ఎమ్మెల్యే, జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధికారి రమేష్ నాయుడు, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, మాజీ సర్పంచ్ వియ్యపు చిన్న, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైల జగన్నాథరావు, తానం సర్పంచ్ కన్నూరి రమణ, ముత్యాలపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు, గొన్న రమాదేవి, వర్రీ పరదేశి, చిన్నారావు, బండ తాతారావు, వెన్నెల నరసింహారావు, పిల్లా శివకృష్ణ, సుందరపు శ్రీనివాసరావు, బల్రెడ్డి సతీష్, పావని తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో శుభ్రత మరియు తాగునీటి సమస్యల పరిష్కారానికి ఈ వాహనాలు ఉపయోగపడతాయని, ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు.

## పరవాడలో జనసేన ప్రజాదర్బార్

### 105 విజ్ఞప్తులు స్వీకరణ

### విధి విధానాల్లో పారదర్శకతే లక్ష్యం: ఎమ్మెల్యే పంచకర్ల





**పరవాడ, పెన్ పవర్ మే 23:**పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, జనసేన ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షుడు శ్రీ పంచకర్ల రమేష్ బాబు పాల్గొన్నారు. వివిధ గ్రామాల ప్రజలు హాజరై మొత్తం 105 వినతిపత్రాలు సమర్పించారు.

రెవెన్యూ సమస్యలు, భూసేకరణతో ఉద్యోగాలు కోల్పోయిన కుటుంబాలకు ఉపాధి, ఫార్మా కంపెనీల వల్ల పర్యావరణ కాలుష్యం, పెన్షన్లు, తాగునీటి సమస్యలు, విద్యుత్ సరఫరా, ఇంటి పట్టాలు, రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణం, చెరువుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ వినతులన్నింటిని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రమేష్ నాయుడు, జోన్ 6 కమిషనర్ శేషాద్రి, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రతీ మలేరియా కేసు కు చికిత్స జరిగేలా చూడాలి..

మలేరియా డిప్యూటీ డైరెక్టర్ రామనాధరావు..

**కురుపాం / గుమ్మలక్ష్మీపురం, పెన్ పవర్, మే 23:** మన్యంలో ప్రతీ మలేరియా కేసు చికిత్స జరిగేలా చూడాలని మలేరియా డిప్యూటీ డైరెక్టర్ రామనాధరావు అన్నారు.

శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా వచ్చిన సందర్భంగా గుమ్మ లక్ష్మీపురం మండలం దుడ్డుఖల్లు పీ హెచ్ సీ పరిధిలోని జర్న గ్రామంలో ఇటీవల మలేరియా గా గుర్తించిన కేసులను కలిసి వారికి క్షేత్ర స్థాయిలో అందిస్తున్న చికిత్స గురించి ఆరా తీసారు. మలేరియా బాధితులను ప్రత్యక్షంగా కలిసి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. దుడ్డుఖల్లు పీ హెచ్ సీ ల్యాబ్ ను తనిఖీ చేసి వైద్యాధికారి ప్రవీణ్ ను జ్వరాల అదుపుకోసం తీసుకుంటున్న చర్యలను గురించి చర్చించారు . అనంతరం రేగిడి పీ హెచ్ సీ లోని పెంగువ గ్రామాన్ని సందర్శించి అక్కడ దోమల లార్వా ప్రదేశాలను గమనించి సిబ్బందికి ఫ్రైడే డ్రైడే ప్రాధాన్యతను వివరించారు. అనంతరం రేగిడి పి హెచ్ సీలోని ల్యాబ్ ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారిణి వై.మణి, సహాయ అధికారి సూర్యనారాయణ మరియు సిబ్బంది పాల్గొన్నారు.





# "గీత" చెరిగిపోయింది - నమ్మకమే నాశనమైంది








- ప్రేమ పేరుతో వంచన
- 2022లో అదృశ్యమైన మహిళ హత్యకు గురైనట్లు తేల్చిన విశాఖ పోలీసులు

**క్రైమ్ బ్యూరో పెన్ పవర్ విశాఖపట్నం 23:** నమ్మకమనే మాటలో ఎంత బలముందో, అంతకన్నా లోతైన గాయాలూ ఉండొచ్చు. అలాంటి గాయం గీత అనే మధ్య వయస్సు మహిళ జీవితాన్ని అర్ధాంతరంగా చెరిపేసింది. 2022లో అదృశ్యమైన గీత (వయస్సు 45), మూడు సంవత్సరాల అనంతరం ఒక హత్య కేసులో బాధితురాలిగా గుర్తించారు.

ఆమె జీవితం ఒక మిశ్రమ గమనమే. రియల్ ఎస్టేట్ లో భాగస్వామిగా ముద్దుగా వ్యవహరించిన ముగ్గురిలో ఒకడైన దివాకర్‌తో గీతకు సాన్నిహిత్యం పెరిగింది. ఆ పరిచయం త్వరలోనే ప్రేమగా మారింది. కానీ, ఆమె ప్రేమను శ్రమగా, జీవిత భాగస్వామిగా చూస్తే.. అతడు మాత్రం తనని అనుభవించి తప్పించుకోవాలని చూశాడు.

పెళ్లి చేసుకోవాలని గీత ఒత్తిడి చేయగా, దివాకర్ గొడవకు దిగాడని, పోలీసుల దర్యాప్తు ప్రకారం, ఇది చివరికి హత్యకు దారి తీసింది. గీతను నిర్దాక్షిణ్యంగా చంపి, తూర్పుగోదావరి జిల్లా ఎర్రవరం సమీపంలోని కాలువలో ఆమె శవాన్ని పడేశాడు. ఈ పాశవిక చర్యలో దివాకర్‌కు వరప్రసాద్ అనే వ్యక్తి సహకరించాడు. కానీ అతడు ఇప్పుడు లేడు– కరోనా మహమ్మారి అతడిని బలితీసుకుంది.

వీటన్నిటి వెనుక గీత మౌనం నిలిచిపోయింది. ఆమె మనసుతో ప్రేమించిన వ్యక్తి చేతుల్లోనే తుదిశ్వాస విడిచే దుస్థితి ఎదురైంది. మూడు సంవత్సరాలుగా ఆమె కోసం ఎదురుచూస్తున్న కుటుంబానికి ఇప్పుడు కనీసం శవమైనా దొరికింది – కానీ, న్యాయం కోసం పోరాటం ఇప్పుడే మొదలవుతుంది.

ఈ కేసును సుదీర్ఘ కాలం పాటు అన్ని కోణాల్లో అన్వేషించి చివరికి చిక్కుముడిని ఛేదించిన మహారాణిపేట పోలీసులు బాధితురాలికి కనీస న్యాయాన్ని చేకూర్చగలిగారు కానీ మన సమాజం ఒక్కసారి ఆలోచించాలి – ఒక్క మహిళ తను నమ్మిన ప్రేమే ఆమె ఆయువు తీసి చివరికి శవంగా మారినప్పుడు, మనం నిజంగా ఎక్కడ నిలబడ్డామో ?

## విద్యను రాజకీయం చేయొద్దు...

- రెగ్యులర్ జిల్లా విద్యా శాఖ అధికారిని నియమించాలి..
- మాజీ విద్యార్థి సంఘం నాయకులు, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ ..



**కురుపాం / పార్వతీపురం,పెన్ పవర్, మే -23.** మన్యం జిల్లాలో పాఠశాల విద్యా రంగాన్ని రాజకీయం చేయొద్దని, తక్షణమే పార్వతీపురం మన్యం జిల్లాకు రెగ్యులర్ జిల్లా విద్యా శాఖ అధికారి (డీ ఈ ఓ )గా ఆ స్థాయి అధికారి ను నియమించాలని మాజీ విద్యార్థి సంఘం నాయకులు, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ శుక్రవారం డిమాండ్ చేసారు.

వరుసగా మూడుసార్లు పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రం లో మొదటి స్థానం వచ్చిన జిల్లాకు రెగ్యులర్ డీ ఈ ఓ ను నియమించలేరా? అని విద్యా శాఖ మంత్రి లోకేష్ ను ప్రశ్నించారు. సీనియర్లు ఉండగా ఒక జూనియర్ ను ఇన్ ఛార్జ్ డీ ఈ ఓ గా ఎలా నియమిస్తారని రంజిత్ కుమార్ ప్రశ్నించారు.

మన్యం జిల్లా పాఠశాల విద్య నాశనం అయిపోయిన కూటమి ప్రభుత్వానికి పరవా లేదా? అని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇదేనా ప్రభుత్వ పాఠశాల విద్యను బలోపేతం చేసే విధానం అని ప్రశ్నించారు. రాజకీయం కోసం పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాల విద్యను నాశనం చేయటానికి పునుకుంటారా? అని ఆవేదన వ్యక్తం చేసారు.ఒక ఎం ఈ ఓ ను అదికూడా సీనియర్ లు ఉండగా జూనియర్ ను ఎలా నియమించారని ప్రశ్నించారు. ఒక హెడ్ మాస్టర్ ప్రమోషన్ కు సీనియారిటీ చూస్తారు. మరి ఒక డీ ఈ ఓ నియామకం లో ఇవేవి చూడరా? అని ప్రశ్నించారు. తక్షణమే పార్వతీపురం మన్యం జిల్లాకు రెగ్యులర్ డీ ఈ ఓ ను నియమించాలని లేదంటే పోరాటం తప్పదని రంజిత్ కుమార్ స్పష్టం చేసారు.ఈ మేరకు శుక్రవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేసారు.

## బంగారమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి గారు..



**కురుపాం, పెన్ పవర్,మే -23,** మండలంలోని వలసబల్లేరు గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ అసిరి పెద్ద బంగారమ్మ తల్లి అమ్మవారి పండుగ సందర్భంగా శుక్రవారం నాడు ప్రభుత్వవిప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అసిరిపెద్దబంగారమ్మ తల్లిని దర్శించుకుని, పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ చల్లగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, కడాయి, పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## జనసైనికులకు డాక్టర్ వంపూరు గంగులయ్య సందేశం

నిబద్ధతకే పురస్కారం - ప్రచార ఆర్భాటాలకు చోటు లేదు



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,మే 23:** పాడేరు అసెంబ్లీ, అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ డాక్టర్ వంపూరు గంగులయ్య తన నియోజకవర్గానికి చెందిన జనసైనికులు, వీర మహిళలు, పార్టీ అభిమానులకు ముఖ్యమైన సందేశాన్ని పంపారు.పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని జనసేనలో నిజమైన శ్రమకే గౌరవం, నిబద్ధతకే గుర్తింపు లభిస్తుందని ఆయన అన్నారు. పార్టీ నిర్మాణానికి కృషి చేసే ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తిస్తుందని, అవకాశం ఆలస్యం అయినా ఖచ్చితంగా లభిస్తుందని పవన్ కళ్యాణ్ ఎప్పటికప్పుడు చెబుతూ వచ్చిన మాటలను గంగులయ్య పునఃస్మరణ చేశారు.ఇటీవల విశాఖపట్నం జివిఎంసి ఉప మేయర్‌గా గోవింద్ రెడ్డి నియమితులైన సందర్భాన్ని ప్రస్తావిస్తూ, ఇది పార్టీకి విశ్వసనీయంగా సేవ చేసిన వారికి లభించే గుర్తింపు అని వివరించారు.సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేయడం, ప్రజలను తప్పుదోవ పట్టించడం, అధిష్టానంపై ప్రభావం కలిగించే వ్యక్తులమనే భ్రమలు కలిగిన ప్రచారాలు పార్టీ విలువలకు భిన్నమని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం, ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడం, అధికారులతో సత్సంబంధాలు పెంచుకోవడం వల్లే నాయకత్వ పాత్రలు లభిస్తాయని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ వంపూరు గంగులయ్య పలు సూచనలు చేశారు.పార్టీ పిలుపు మేరకు ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొనండి.ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించుకోండి.అధికారులతో సత్సంబంధాలను మెరుగుపరచండి.నిబద్ధత, నిజాయితీ, సేవా ధర్మం ఆధారంగా మీ నాయకత్వ లక్షణాలను పెంపొందించండి అన్నారు.అలాగే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసి కాదు, ప్రజల్లో నడిచి, వారి మద్దతు పొందిన వారికే జనసేనలో భవిష్యత్తు ఉందని ఆయన స్పష్టం చేశారు. పార్టీకి అన్యాయం జరిగేలా,నియమ నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరు పనిచేయరాదని తెలిపారు.కావున పార్టీ అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

## బీచ్ రోడ్డులో మూడో రోజూ యోగా అభ్యాసం







**విశాఖ తూర్పు, పెన్ పవర్ మే 23:** యోగాంధ్ర-2025 సందర్భంగా నిర్వహిస్తున్న యోగా శిక్షణ శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మూడో రోజు ఉదయం ఆర్‌కే బీచ్ ప్రాంగణంలో యోగా అభ్యాసకులు, శిక్షకుల సహకారంతో యోగాసనాలు వేసి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచే సాధనను కొనసాగించారు.'వన్ ఎర్త్, వన్ హెల్త్' నినాదంతో ఈ ఏడాది జూన్ 21న జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం విశాఖపటాన్ని ప్రధాన వేదికగా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నెల రోజుల పాటు జరుగుతున్న యోగాంధ్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా జిల్లా యంత్రాంగం, ఆయుష్ శాఖ, క్రీడా ప్రాధికార సంస్థ సమన్వయంతో ప్రతిరోజూ బీచ్ రోడ్డులో యోగా శిక్షణ కొనసాగుతోంది.కర్టెన్ రైజర్ ఈవెంట్ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికను అలాగే కొనసాగించడంతో యోగా అభ్యాసకులకు అనుకూలమైన వాతావరణం లభిస్తోంది. ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంచడమే కాకుండా, వారిని దీర్ఘకాలిక ఆరోగ్యానికి ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడుతున్నాయి.

## జర్రేలా పంచాయితీ చింతలవాడలో జనసేన పార్టీలో భారీగా చేరికలు





**గూడెం కొత్తవీది,పెన్ పవర్,మే 23:** జనసేన పార్టీకి గ్రామీణ ప్రాంతాల్లో బలం పెరుగుతున్న విషయం తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం జర్రేలా పంచాయితీ చింతల వాడ గ్రామంలో జరిగిన భారీ చేరికలతో మరోసారి స్పష్టమైంది.చింతల వాడలో నిర్వహించిన పార్టీ సమావేశంలో పలు పదవుల్లో ఉన్న గ్రామస్తులు జనసేన పార్టీలో చేరారు.జీకే వీధి మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణు మూర్తి, నాయకులు చిక్కుడు అశోక్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం జరిగింది.జనసేన పార్టీ పాడేరు ఇంచార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామస్థుల ఆహ్వానంతో జరిగిన ఈ సమావేశంలో, వారు గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణపై ప్రశ్నలు సంధించగా, గంగులయ్య సమాధానమిస్తూ ం "పార్టీ ప్రయోజనాలకంటే గిరిజన జాతి ప్రయోజనమే మాకు ముఖ్యం. అధికారం కోసం కాదు, బాధ్యత కోసం రాజకీయాలలో ఉన్నాం" అని తెలిపారు.ఇటీవల అవినీతి, అరాచక రాజకీయాలపై అవగాహన కల్పిస్తూ విద్యావంతులైన యువతతో గ్రామాలు తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలు కనుగొనే ప్రయత్నంలో ఉన్నామని వెల్లడించారు. "పరిశీలించు, ప్రశ్నించు, పరిష్కారం సాధించు" అనే మూడంచెల విధానంతో పనిచేస్తున్నామని తెలిపారు.ఈ సమావేశంలో చింతల వాడ గ్రామస్తులు, జర్రేలా పంచాయితీ పీసా ఉపాధ్యక్షులు చిక్కుడు అశోక్, వైస్ సర్పంచ్ పొత్తూరు వెంకటేష్,వార్డ్ మెంబర్ కొంతులంగి భగవాన్ ధర్మరాజు, గసాడి వెంకటరావు,ముర్ల శీనుబాబు, మణుగూరు ప్రసాద్, చిట్టిబాబు, వెంకట్, గణేష్ రావు, రంగారావు, రామారావు, కృష్ణ, కొండపల్లి తదితరులు గంగులయ్య చేతుల మీదుగా జనసేన కండువాలు ధరించి పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో గూడెం కొత్తవీధి మండల జనసేన పార్టీ అధ్యక్షులు కొయ్యం బాలరాజు, అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లే వీర వెంకట్, మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు సిద్దార్థ మార్క్, సోషల్ మీడియా మరియు ఐటి ఇంచార్జ్ కొయ్యం ఇమ్మానుయేల్(సిద్దు),అరడా కోటి, గుండ్ల రఘువంశీ, వనపల ఈశ్వర్, గడుతూరి పరిమేశ్వరావు,మధు, పెదవలస సర్పంచ్ కృష్ణ వంశి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ వసుపరిప్రసాద్, సాలెబు అశోక్ (ఐటీ ఇంచార్జ్),మజ్జి సంతోష్, గడుతూరి రమణ, జయరాజు మజ్జి, సత్యనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు.జనసేన పార్టీ అధినేత మరియు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాల ప్రేరణతో గిరిజన అభివృద్ధే లక్ష్యంగా కొనసాగుతున్నామని గంగులయ్య స్పష్టం చేశారు.

## ఎండియు వ్యవస్థ రద్దు నిర్ణయం కూటమి ప్రభుత్వం విరమించుకోవాలి

- ప్రజలకు ఉపయోగపడే వ్యవస్థను తొలగించటం బాధాకరం
- పాడేరు అసెంబ్లీ వైసీపీ వాణిజ్య విభాగం అధ్యక్షులు వనపల రాజేష్



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మే23:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు ఒక కోటి 45 లక్షల మంది రేషన్ కార్డుదారులకు నేరుగా రేషన్ సరుకులు అందించడం కొరకు వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన ఎం.డి.యు ఆపరేటర్స్ వ్యవస్థను ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేయడం బాధాకరమని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గం వైసీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు వనపల రాజేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో లబ్ధిదారులకు నేరుగా రేషన్ సరుకులు అందించడం కొరకు అప్పటి వైసిపి ప్రభుత్వం 9260 మంది ఎండియూ ఆపరేటర్లను నియమించిందని, వారితోపాటు మరో 9260 మంది హెల్పర్స్ ఉన్నారని అర్ధాంతరంగా ఈ వ్యవస్థను రద్దు చేస్తే వారు జీవనోపాధి కోల్పోయిన వారు అవుతారని, వారి కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశం కల్పించకుండా ఎండియు వ్యవస్థను రద్దు చేయటం హేయమైన చర్యగా అభివర్ణించారు. గిరిజన ప్రాంతంలో ఎండియు వ్యవస్థ ఇప్పటివరకు చాలా చక్కగా సేవలు అందించిందని, గృహాల వద్దకే నేరుగా సరుకులను తీసుకొని వచ్చి లబ్ధిదారులకు అందించారని అన్నారు. ఈ వ్యవస్థను రద్దు చేయటం వలన మళ్లీ గిరిజనులు ఐదు నుండి పది కిలోమీటర్లు రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి ఉంటుందని, దీంతో ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉందని, కావున ప్రజల ఇబ్బందులను అలాగే ఎండియు ఆపరేటర్ల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకొని ఎండియు వ్యవస్థను కొనసాగించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

# దువ్వాడ రైల్వే స్టేషన్‌లో డిఆర్ఎం తనిఖీలు



**గాజువాక, పెన్ పవర్ మే 23:**తూర్పు తీర రైల్వే దువ్వాడ రైల్వే స్టేషన్‌లో అమృత భారత్ పథకంలోని అభివృద్ధి పనులను వాల్తేరు డివిజన్ డిఆర్ఎం లలిత్ బోహ్రా, సీనియర్ డిసిఎం-1 కె. సందీప్ తనిఖీ చేశారు. ఫ్లాట్‌ఫాం-1 వద్ద నిర్మాణాలు, 12 అడుగుల వెడల్పుతో ఫ్లైఓవర్ బ్రిడ్జి, రోడ్ విస్తరణ పనుల ప్రగతిని పరిశీలించారు. స్టేషన్‌లోని దుకాణదారులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాషువా, సభ్యుడు ఈశ్వర్ తదితరులు డిఆర్ఎంను సత్కరించి, 22707/08 ఎసి డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌కు 2ఎసి, 3ఎసి, 3ఇ కోచ్లు చేర్చాలని, స్టేషన్‌లో నీటి సరఫరా, కోచ్ నిర్వహణ సిబ్బంది నియామకం కోరారు.

బౌద్ధకొండ ప్రాంతంలో పచ్చదనం పెంపకం, లోకాస్ట్ దుకాణాల ఏర్పాటు, రోడ్డు సుందరీకరణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ సీఐ రమణ, ఇంజనీర్ సాయినువాబ్‌నాథ్, ఎలక్ట్రికల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్యేక కార్యక్రమానికి అనుమతి**

ఈ నెల 25న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దువ్వాడ యూజర్స్ అసోసియేషన్, మానవ వికాస్ తదితర సంస్థలు నిర్వహించే ర్యాలీ, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలకు కె. సందీప్ అనుమతి ఇచ్చారు.

## సబ్సిడీ ద్వారా అందించే విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

దామనపల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మే 23**:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దామనపల్లి పంచాయతీ సచివాలయంలో రైతు సేవ కేంద్రం వద్ద స్థానిక సర్పంచ్ కుందేరి రామకృష్ణ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ ద్వారా పంపిణీ చేసే పచ్చిరొట్ట విత్తనాలు, వరి విత్తనాలను గురువారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం సకాలంలో రైతులకు 90 శాతం సబ్సిడీ ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే సకాలంలో విత్తనాలు వేసుకొని వ్యవసాయ మెలుకువలు పాటించి వ్యవసాయంలో రాబట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాగిన బాలరాజు, పేసా కమిటీ కార్యదర్శి సాగిన రాధాకృష్ణ, గ్రామ పెద్దలు పల్లం నాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ జోసెఫ్,సర్వేయర్ బుజ్జిబాబు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అలల మధ్య జీవితాల అరుపు

- విశాఖ బీచ్ లైఫ్‌గార్డుల శౌర్యగాథ



**క్రైమ్ బ్యూరో పెన్ పవర్ విశాఖపట్నం మే 23:** సముద్రపు అలలు పరవళ్ళు తొక్కుతున్న ఆర్కే బీచ్. వేసవి సెలవుల్లో సందడి కోసం నగరానికి విచ్చేసిన యువతీ యువకుల రద్దీ. అలల మధ్య ఆనందంగా స్నానం చేస్తూ గడిపే యువత కోసం బీచ్ శాంతిభద్రతల వెనుక అప్రమత్తంగా పనిచేస్తున్నవారు జీవీఎంసీ లైఫ్‌గార్డులు.

అయితే శుక్రవారం ఉదయం, ఆ అలల మధ్యే ఒక్కసారిగా ఒక శబ్దం వినిపించింది... "ఎవరైనా కాపాడండి!" – సముద్రపు లోతుల్లోకి వెళ్లి అలలకి చిక్కుకున్న నలుగురు యువకుల ప్రాణాలను కాపాడే విషయంలో ఒక్క క్షణం ఆలస్యం అయితే తీవ్ర పరిణామాలు ఏర్పడేవి. హైదరాబాద్ నుంచి వచ్చిన ఎనిమిది మంది యువకులలో షబ్బీర్ (19), అబ్బాస్ (18), విద్రస్ (16), హుస్సేన్ (18) అనే నలుగురు సముద్రపు అలలకు చిక్కారు.

ఈ హఠాత్ పరిణామానికి స్పందించిన లైఫ్ గార్డులు ఎం.ధనరాజు, ఎం.నవీన్, వి.ఆనంద్, సిహెచ్.లక్ష్మణరావు, కె.పి.ఎస్.వాసు ၁ ఆ వెంటనే చర్యలకు దిగారు. "వాళ్ళను చూడగానే మేము ముందుకు దూకాం, సముద్రం ఎలా ఉన్నా, మనం ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకూడదు" అంటూ ధనరాజు చెప్పిన మాటల్లో బాధ్యతకు ప్రతిబింబం కనిపిస్తుంది.

ఆ నలుగురు యువకులను సురక్షితంగా ఒడ్డుకి తీసుకువచ్చిన తరువాత, వారిని పోలీసుల కు అప్పగించారు. కౌన్సిలింగ్ ఇచ్చిన అనంతరం వాళ్లను తిరిగి పంపించారు. ఈ ఘటనపై జీవీఎంసీ ఇన్‌చార్జ్ స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు స్పందిస్తూ, "మన బీచ్ లైఫ్ గార్డులు మరోసారి తమ సేవా ధర్మాన్ని నిరూపించారు. వారిదే నిజమైన హీరోయిజం" అని అన్నారు.

బహుశా ఈ యువకులు మర్చిపోలేని రోజు అది – మరణంతో ఒక్క క్షణం దూరంలో ఉండి, తిరిగి జీవితం వైపు రప్పించిన ఆ ఐదుగురు లైఫ్ గార్డుల కృషి వారి జీవితంలో ఒక కొత్త అధ్యాయం లాంటిది.

వీరి కథలు వార్తల శీర్షికల్లో ఎక్కువగా కనిపించకపోవచ్చు. కానీ ప్రతి రోజు అలల మధ్య నిలబడి వేలాదిమందికి భద్రతగా నిలిచే వీరు – సముద్ర తీరాన నిలిచే గోప్యమైన రక్షక గోడలు.

## మహారాణిపేట మిస్సింగ్ కేసు ఛేదన

విషాద ప్రేమకథకు దారితీసిన రియల్ ఎస్టేట్ వ్యాపారం




**క్రైమ్ బ్యూరో పెన్ పవర్ విశాఖపట్నం, మే 23:**2021లో అదృశ్యమైన మహిళ పల్లా గీత (45) హత్యకు గురైంది, ఈ మిస్టరీ కేసును మహారాణిపేట పోలీసులు ఛేదించారు. గీత కుమార్తె సునీత ఇచ్చిన పిర్యాదుతో ప్రారంభమైన కేసు, అనంతరం క్లూస్ లేని కారణంగా మూసివేయబడింది. కానీ ఇటీవల సునీత విజ్ఞప్తితో, కేసును పునర్విచారణకు అప్పగించగా, పి.సి.ఆర్. ఇన్‌స్పెక్టర్ షేక్ హుస్సేన్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం హత్య కేసుగా మారుస్తూ ఛేదించింది.

దర్యాప్తులో గీత – దివాకర్ మధ్య ఉన్న సంబంధాలు వివాహ ఒత్తిడి దాకా వెళ్లి, దివాకర్ ఆమెను అత్యంత పాశవికంగా హత్య చేసి, శవాన్ని తూర్పు గోదావరి జిల్లా ఎర్రవరం కాలువలో పారేసినట్లు తేలింది. అతడికి సహకరించిన వరప్రసాద్ కొవిడ్ కారణంగా మృతిచెందగా, ప్రధాన నిందితుడు దివాకర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

దర్యాప్తులో కీలక ఆధారాలపై దృష్టిసారించి, హత్య తర్వాత ఆమెను కనిపించనట్టుగా నటించిన దివాకర్ తెలివితేటలతో తప్పించుకోగలిగినా, చివరకు నిజం వెలుగులోకి వచ్చింది. చివరికి ఈ కేసును అత్యంత చాకచక్యంగా ఛేదించిన పోలీస్ బృందాన్ని ,పోలీస్ కమిషనర్ శంఖబ్రత బగ్చీ ప్రశంసలు గుప్పించారు.

# పండుగలా జిల్లా మహానాడు







- విశాఖకు ప్రపంచ గుర్తింపుకి చంద్రబాబు కృషి : గండి బాబ్జి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్ మే 23 :**జిల్లా మహానాడు కార్యక్రమం పండుగ వాతావరణంలో జరగ్గా, విశాఖను ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేయడంలో సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషిస్తున్నారని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మహానాడు సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా భీమిలి శాసనసభ్యులు గంట శ్రీనివాసరావు మాట్లాడుతూ, సింహాచలం పంచ గ్రామాల సమస్యపై తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ అంశాన్ని మహానాడు వేదికపై కూడా ప్రస్తావించనున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, శాసనమండలి విప్ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభ ప్రారంభంలో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించగా, గత మూడు సంవత్సరాల్లో మృతి చెందిన పార్టీ నేతలు, కార్యకర్తల కోసం మౌనం పాటించారు. పూర్వ ఎంపీ పెతకంశెట్టి అప్పలనరసింహం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు.

## ఎండియూ వ్యవస్థను కొనసాగించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం

ఎండియు ఆపరేటర్ల పోరాటానికి వైసిపి మద్దతు



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 23:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎండియూ ఆపరేటర్ల యూనియన్ సభ్యులు శుక్రవారం పాడేరు శాసనసభ్యులు మత్స్యరస విశ్వేశ్వర రాజును కలసి ఏండియు ఆపరేటర్ల వ్యవస్థను రద్దు చేయకుండా సహకరించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మొత్తంలో 221 మంది ఎండియూ ఆపరేటర్లు ఉన్నారని ప్రభుత్వం అర్ధాంతరంగా ఈ వ్యవస్థను రద్దు చేయడంతో మా కుటుంబాలన్నీ రోడ్డున పడతాయని ఎండియూ ఆపరేటర్లను ప్రభుత్వం కనీసం సంప్రదించకుండా వ్యవస్థను రద్దు చేయటం బాధాకరమని ఎం డి యు ఆపరేటర్ల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకొని వ్యవస్థను రద్దు చేయకుండా ఉండేలా కృషి చేయాలని వినతి పత్రంలో కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వాంలో జగన్మోహన్ రెడ్డి పేదలకు మేలు జరగాలి, పేదవాళ్లు రేషన్ కోసం కష్టపడకూడదు అనే ఉద్దేశంతో ఇంటిదగ్గరకే రేషన్ అందించాలి అనే లక్ష్యంతో ఎండియు వ్యవస్థను ఏర్పాటు చేసి వందలాది మందికి ఉపాధి కల్పించటం జరిగిందని, నేరుగా రేషన్ కార్డుదారుల వద్దకే రేషన్ అందించటం జరిగిందని దీంతో గిరిజన ప్రాంతంలో ఎంతో మేలు జరిగిందని అన్నారు. కానీ ఈ కూటమి ప్రభుత్వం పేదవాళ్లు కష్టాల్లోనే ఉండాలి అనే విధానంతో కేవలం రాజకీయ కక్షతోనే ఎండియు వ్యవస్థను రద్దు చేస్తుందని ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. రేషన్ కార్డుదారుల సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, అలాగే ఎండీయూ ఆపరేటర్ల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని ఎండియు వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎండియూ ఆపరేటర్లకు సంపూర్ణమైన మద్దతు ఉంటుందని,మీ పోరాటానికి నేనెప్పుడూ మీ ముందు ఉంటానని ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు అన్నారు.ఈ కార్యక్రమంలో ఎండియు జిల్లా యూనియన్ సభ్యులు వైసీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. పండన్న, కించూరు సర్పంచ్ వంతల రాంబాబు, పాడేరు నియోజకవర్గ వాలంటరీ యూనియన్ అధ్యక్షుడు మత్స్యరస కూర్మం రాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఫిర్యాదుల పరిష్కార వివరాలు ఫిర్యాదుదారునికి తెలియాల్సిందే




జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 23:** పాడేరు ఐటీడీఏలో ప్రతి శుక్రవారం, రంపచోడవరం ఐటీడీఏలో ప్రతి సోమవారం, చింతూరు ఐటీడీఏలో ప్రతి బుధవారం నిర్వహించే "మీకోసం" ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను ఆన్లైన్‌లో నమోదు చేసి, సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో జరిగిన "మీకోసం" కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో తహశీల్దార్లు, ఎంపీడీఓలు ప్రతి సోమవారం తమ కార్యాలయాల్లో ప్రజా సమస్యల వేదికలో అర్జీలు స్వీకరించి, వాటిని వెంటనే ఆన్లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు.అర్జీల పరిష్కార వివరాలను ఫిర్యాదు దారులకు తప్పనిసరిగా తెలియజేయాలనీ, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రుల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం లేదా నిర్లక్ష్యం కనబడితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమాచారం**

అర్జీదారులు తమ ఫిర్యాదు పరిష్కార స్థితిని తెలుసుకునేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా సమాచారం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.యోగాంధ్రలో అన్ని శాఖల సిబ్బంది పాల్గొనాలి.జూన్ 21 వరకు జరుగుతున్న "యోగాంధ్ర" కార్యక్రమంలో అన్ని శాఖల సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శాఖ తరపున ప్రతిరోజూ సిబ్బంది యోగ సాధనలో పాల్గొనాలని, ప్రతి సచివాలయం నుంచి ఏడుగురు ట్రైనర్లను ఎంపిక చేయాలని, మాస్టర్ ట్రైనీల ఎంపిక వేగవంతం చేయాలని సూచించారు.విద్యార్థులు వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 16 క్రీడాంశాల్లో 50 శిక్షణా శిబిరాలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. శిక్షకులకు రూ.2.50 లక్షల విలువైన క్రీడా పరికరాలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఇంచార్జ్ పిఒ డాక్టర్ అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ కె. పద్మలత, ఎస్‌డిసిఎం వి.ఎస్ లోకేశ్వరరావు, జిల్లా క్రీడా అధికారి కె. జగన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# 350 కిలోల అక్రమ గంజాయి పట్టివేత - ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మే 23:**మండలంలో గల జోలపుట్టు పంచాయితీ లబ్బూరు జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 350 కిలోల గంజాయిని ముంచంగిపుట్టు పోలీసులు పట్టుకున్నారు. ఒడిస్సా ప్రాంతం నుండి గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న పక్కా సమాచారం మేరకు లబ్బూరు జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీ చేస్తున్న క్రమంలో ఏపీ 31 ఎక్స్ 1537 నంబరు గల ఆటోలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వాహనాన్ని ఆపి తనిఖీలు చేయగా 12 మూటలలో 350 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించామని ఎస్సై రామకృష్ణ తెలిపారు. పట్టుబడిన ఇద్దరి నిందితులు తుమిడిపుట్టు గ్రామానికి చెందిన గొల్లోరి సోమనాథ్, సోలగంపుట్టు గ్రామానికి చెందిన సుకేరి గాసిరంలుగా గుర్తించమని, పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను విచారణ చేయగా మరో ముగ్గురు వ్యక్తుల హస్తం ఉన్నట్లు గుర్తించామని ఎస్సై జె రామకృష్ణ తెలిపారు. ఒడిస్సా రాష్ట్రానికి వెళ్లి 350 కిలోల గంజాయిని రైతులు వద్ద నుండి కొనుగోలు చేసి జోలాపుట్టు ప్రాంతానికి చెందిన తునా నాయక్ అనే వ్యక్తికి సరఫరా చేయడానికి తీసుకు వెళుతున్నట్లు ఇద్దరి నిందితుల విచారణలో తెలియజేశారని ఆయన తెలిపారు. తునా నాయక్, కిల్లో గోపాల్, కిముడు ధనుర్జాయ్ లను %ూ- 3, ూ-4, ూ%-5 లుగా గుర్తించి ఎన్ డి పిఎస్ చట్టం కింద కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు. పట్టుబడిన గంజాయి విలువ 17 లక్షల 50 వేల వరకు ఉంటుందని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గంజాయి సప్లై చేయబడిన చేసిన వ్యక్తులను, ఎవరికి గంజాయి చేరుతుంది అనే విషయాలను దర్యాప్తు చేసి వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. అల్లూరి జిల్లా పోలీసు వారి ఆదేశాల మేరకు ఎవరైనా గంజాయి సాగు చేయడం, రవాణా చేయడం, కలిగి ఉండటం, అమ్మడం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

